
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
ఆదివారం 7 సెప్టెంబరు 2025





సంగారెడ్డిలో గంగమ్మ ఒడికి చేరుతున్న గణనాథుడు



ప్రకృతి ఒడిలో పర్షరాంనగర్

'పర్ష'వారి పల్లె

ఊరంతా ఒకే కుటుంబం

- ఆరుగురు అన్నదమ్ములతో వెలసిన గ్రామం
- నేడు 78 కుటుంబాలు..
- 380 మంది జనాభా
- ఇంటి పేరే ఊరి పేరుగా స్థిరపడి వైనం
- నాడు జోడుచెర్ల.. నేడు పర్షరాంనగర్

7లో

Sunday Special



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. సంగారెడ్డిలోని జడ్పీ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ దవాఖాల్లో మెరుగైన వైద్యం అందజేయాలని, సీజనల్ వ్యాధులు విస్తరించకుండా చర్యలు చేపట్టాలన్నారు. మెరుగైన సేవలందిస్తున్న పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేయడానికి, కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తదుపరి సమావేశం వరకు ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది జాబ్‌చార్ట్, సమగ్ర వివరాలతో హాజరుకావాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల తదితరులు పాల్గొన్నారు.

అనంతరం సీఎస్ఆర్ నిధులతో విద్యా సంస్థల్లో చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించారు. పనులు నాణ్యతతో జరిగేలా అధికారులు తనిఖీలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి తుల్జానాయక్, సీపీవో బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.



జోగిపేటలో...

వెళ్లిరా గణపయ్యా..



సంగారెడ్డి పట్టణంలో శోభాయాత్రలో ఉత్సాహంగా నృత్యం చేస్తున్న మహిళలు, యువతులు

ముగిసిన వినాయక నిమజ్జనం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిసాయి. సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో మండపాల్లో పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయకులను మహబూబ్‌సాగర్ చెరువులో నిమజ్జనం చేశారు. శనివారం 300 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం భారీ క్రేన్లు, పడవలు, గజ ఈతగాళ్లను ఏర్పాట్లు చేశారు. నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ ప్రావీణ్య అధికారులతో కలిసి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని, వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రాల్లోనూ నిమజ్జనానికి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.







మరిన్ని ఫొటోలు 8లో



సంగారెడ్డిలో...



సంగారెడ్డిలో...

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి
- మెదక్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సత్కారం



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, పక్కన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజ నిర్మాణంలో కీలకమని టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. మెదక్ కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి వ్యజులీ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రోత్సహించాలని పేర్కొన్నారు. చదువుతోపాటు ఉత్తమమైన వ్యక్తులుగా తీర్చిదిద్దాలని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత నిస్తుందన్నారు. అనంతరం 58 మంది జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఈవో రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఎంవో సుదర్శనమూర్తి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిపాలనాధికారులు

మెదక్ జిల్లాలో 91 మంది నియామకం



మెదక్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పాలనలో కీలక మార్పు దిశగా అడుగులు పడుతున్నాయి. గ్రామ పాలనా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సర్కారు తిరిగి గ్రామ పాలనాధికారులను తెరపైకి తెచ్చింది. మెదక్ జిల్లాలో 91 మంది గ్రామ పరిపాలనాధికారుల నియామకం పూర్తయింది. వీరికి జిల్లావ్యాప్తంగా 185 రెవెన్యూ క్లస్టర్లలో విధులు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జూలైలో వీఆర్వో, వీఆర్ఏలకు రాత పరీక్ష నిర్వహించి, అర్హత సాధించిన వారిని జీపీవోలుగా నియమించారు. వారికి ఈ నెల 5న హైదరాబాద్‌లో సీఎం చేతుల నియామక పత్రాలు అందజేశారు. మెదక్ జిల్లాకు చెందిన 91 మంది వీఆర్వో, వీఆర్ఏలు గ్రామ పాలనాధికారులుగా అర్హత సాధించారు. జిల్లాలో 392 రెవెన్యూ గ్రామాలను 185 రెవెన్యూ క్లస్టర్లుగా విభజించారు. రెండు, మూడు రెవెన్యూ గ్రామాలను కలిపి ఒక్కో క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. మొదట ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో జీపీవోను నియమించాలని ప్రభుత్వం భావించింది. కానీ, అర్హత సాధించిన జీపీవోలు తక్కువ సంఖ్యలో ఉండడంతో రెవెన్యూ శాఖలో దిగువ శ్రేణి సహాయకులు, రికార్డు అసిస్టెంట్లకు కూడా క్లస్టర్ల బాధ్యతలు అప్పగిస్తారని భావిస్తున్నారు. అయితే జీపీవోలుగా ఎంపికైన వారికి సొంత గ్రామం, మండలం, నియోజకవర్గంలో పోస్టింగులు ఇవ్వరాదని భూ పరిపాలన శాఖ కమిషనర్ ఆదేశించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దంపతుల విషయంలో నిర్దిష్ట మినహాయింపు ఇవ్వవచ్చని భావిస్తున్నారు. నియామకాల జాబితాను కలెక్టర్ పరిశీలించిన అనంతరం పారదర్శకంగా క్లస్టర్లను కేటాయించే పనిలో ఉన్నారు.

గ్రామ పాలనకు దన్ను

ఐదేళ్ల క్రితం వరకు గ్రామాల్లో రెవెన్యూ విధులను నిర్వహించేందుకు వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ ఉండేది. రెవెన్యూశాఖ అవినీతికి కేరాఫ్‌గా మారిందని 2020 సెప్టెంబరులో గత ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దు చేసి వీఆర్వో, వీఆర్ఏలను ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేశారు. దీంతో రెవెన్యూశాఖలో అవినీతి మాత్రం అంతం కాకపోగా మరింత పెరిగిందని పలువురు అభిప్రాయపడ్డారు. వీఆర్వోలు లేకపోవడంతో గ్రామాల్లో భూ సమస్యలను చెప్పుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని రైతులు వాపోయారు. ఏ చిన్న సమస్య వచ్చినా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ధరణి పోర్టల్‌లో భారీ ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నా సమస్యలు తీరలేదు. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ పాలనా వ్యవస్థను బలోపేతం చేసేందుకు గ్రామ పాలనాధికారులను నియమిస్తున్నది.



గర్భాలయంలో పడిన సూర్య కిరణాలు

వేంకటేశ్వరుడికి అరుణార్చన

స్వామి వారిని తాకిన సూర్య కిరణాలు 7

వర్షాలతో ట్రాన్స్‌కోకు నష్టం.. రూ.13.5 కోట్లు

6

ప్రభుత్వ భూమి కబ్జాకు స్కెచ్

కాలనీ మధ్యలో ఉన్న స్థలానికి ఫేక్ డాక్యుమెంట్లు

- బోరు వేసేందుకు విఫలయత్నం
- తిరగబడిన కాలనీ వాసులు
- తోక ముడిచిన అక్రమార్కులు



ప్రభుత్వ స్థలంలో బోరు వేస్తున్న వ్యక్తులను నిలదీస్తున్న రేయిన్‌బో మీడోస్ కాలనీవాసులు

అమీన్‌పూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాలనీ మధ్య ఉన్న కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని హస్తగతం చేసుకునేందుకు నకిలీ డాక్యుమెంట్లతో చేసిన ప్రయత్నాన్ని కాలనీవాసులు అడ్డుకున్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ కిష్టారెడ్డిపేట రేయిన్‌బో మీడోస్ కాలనీ మధ్యలో 208, 210 సర్వే నంబర్లలో 1.06 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. చుట్టూ పట్టా సర్వే నంబర్లు ఉండటంతో రెవెన్యూశాఖ సంరక్షిస్తూ వస్తున్నది. ప్రభుత్వ భూమి చుట్టూ ఉన్న ప్రైవేటు భూమిలో హెచ్‌ఎండీఏ లేఅవుట్ వేసి రేయిన్‌బో మీడోస్ కాలనీ పేరుతో ఇళ్లను నిర్మించారు. దీంతో, మధ్యలో ఉన్న కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిపై కొందరి కన్ను పడింది. 201 సర్వే నంబర్‌లో పది గుంటల భూమిని కొనుగోలు చేశామని కొందరు వ్యక్తులు పత్రాలను చూపించి, 208, 210 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కార్యాచరణ రూపొందించారు. వీరికి తెర వెనుక కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నట్లు చెప్పుకుంటున్నారు.

కబ్జా యత్నం విఫలం

ప్రభుత్వ భూమిలో శనివారం ఉదయం కొందరు వ్యక్తులు బోరు తవ్వడం ప్రారంభించారు. ఇది గమనించిన కాలనీవాసులు నిలదీయడంతో తమ సొంత భూమి అని దబాయించేందుకు ప్రయత్నించారు. కానీ, కాలనీవాసులు ఎదురుతిరగడంతో జారుకున్నారు. సమాచారం అందుకున్న అమీన్‌పూర్ తహసీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. ప్రభుత్వ భూమిలో బోరు వేసినందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలనీ మధ్యలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడి సామాజిక కార్యకలాపాలకు వినియోగించాలని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు జీవన్‌రెడ్డి, వేణు, శ్రీధర్, విశ్వనాథం, కృష్ణ, అనిల్, కాశీనాథం, సాయిరాం, సుజన్, ప్రవీన్, అఖిల్, రాహుల్, సతీష్, ప్రకాష్ తదితరులు కోరారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్లరాజు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు కాలనీవాసులతో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

పాఠశాలల్లో సౌకర్యాలను

సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్



కొండాపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన వనమహోత్సవానికి కలెక్టర్ హాజరై మొక్కలు నాటారు. మొక్కలను నాటి సంరంక్షించడం ద్వారా విద్యార్థులకు పర్యావరణంపై అవగహన కలుగుతుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని, బీసీ వసతి గృహన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, తహసీల్దార్ అశోక్, నాయబ్ తహసీల్దార్ వినయ్, ఎంఈవో దశరథ్, ఆర్ఐ రాజు, ఏపీవో వీరప్ప, పంచాయతీ కార్యదర్శి నర్సమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇరువురి అరెస్ట్

చేర్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో ఇరువురిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన బొడ్డు చందు, చుంచనకోట గ్రామానికి చెందిన పొన్నబోయిన పవన్‌ను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు చేర్యాల సీఐ ఎల్. శ్రీను తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయికి సేవనానికి అలవాటుపడిన బొడ్డు చందు, పొన్నబోయిన పవన్ జల్సాలకు అలవాటుపడ్డారు. హైదరాబాదులో గుర్తుతెలియని వ్యక్తి దగ్గర కొనుగోలు చేసి గంజాయి విక్రయానికి ఒడిగట్టారు. పట్టణ శివారులోని లక్ష్మీనర్సింహ్మస్వామి దేవాలయ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో వారి నుంచి 440గ్రాముల గంజాయి పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని రెండు మొబైల్ ఫోన్లు, గంజాయి సేవనానికి వినియోగించే రోల్ పేపర్ బండిల్, స్పిరిట్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసునమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై నవీన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశృతి

అమీన్‌పూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో శుక్రవారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనం ఊరేగింపు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో వినయ్, విజయ్‌కుమార్ అనే ఇద్దరు కడుపులో కత్తిపోట్లకు గురయ్యారు. తీవ్ర రక్తస్రావం జరగడంతో ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తడంతో అమీన్‌పూర్ పోలీసులు రంగంలోకి దిగి గుంపును చెదరగొట్టారు. కత్తిపోట్లకు గురైన బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వేరు వేరు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ పేర్కొన్నారు.

సమోసాలో కంకర రాళ్లు


సమోసాలో కంకర రాయి

శివ్వంపేట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): స్వీట్ షాపులో కొనుగోలు చేసిన సమోసా తింటుండగా దానిలో 20 ఎంఎం సైజు కంకర రాయి వచ్చింది. దీంతో అవాక్కైన బాధితులు స్వీట్ షాపు నిర్వాహకులను నిలదీసిన సంఘటన శనివారం శివ్వంపేటలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన పేరక వెంకటేష్ శివ్వంపేటలోని శ్రీ బాలాజీ పవన్ మిఠాయి బండారు స్వీట్ షాపులో సాయంత్రం వెంకటేష్ నాలుగు సమోసాలు కొనుగోలు చేశాడు. అందులో రెండు సమోసాల్లో కంకర రాళ్లు వచ్చాయి. దీంతో స్వీట్ షాపు నిర్వాహకులను నిలదీశాడు. స్వీట్ స్వీట్ షాపు నిర్వాహకుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ అధికారి స్వదీప్ కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వెంకటేష్ పేర్కొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

కోహీర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోహీర్ మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలో గల 65వ జాతీయ రహదారిపై శనివారం ఉదయం టమాట లోడ్‌తో మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణహాని జరగలేదు. అయితే లారీ అదుపుతప్పి బోల్తాపడడంతో దిగ్వాల్ బస్టాండ్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జాం అయింది. జాతీయ రహదారిపై రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. లారీ బోల్తాపడడం కారణంగా డీజిల్ ట్యాంకు పగిలిపోయింది. దీంతో రోడ్డు మొత్తం డీజీల్ పారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. సాయంత్రం వరకు రోడ్డుపై బోల్తా పడిన లారీని తీయకపోవడంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆలస్యం జరిగింది

అదనపు కట్నం వేధింపులే కారణం


ప్రమీల తన భర్త(ఫైల్)

నారాయణఖేడ్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భర్త అనుమానించడమే కాకుండా అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేయడంతో రెండేళ్లలోపు ఇరువురు చిన్నారులను గొంతునులిమి హతమార్చి తాను ఉరి వేసుకుంది. శుక్రవారం ఇద్దరు పిల్లల గొంతు నులిమి ఆత్మహత్య చేసుకున్న ఘటన వివరాలను శనివారం నారాయణఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి మీడియాకు వెల్లడించారు. మండల కేంద్రమైన నిజాంపేటకు చెందిన బూషి సాయమ్మ, రాములు కుమార్తె ప్రమీల(22)ను నాలుగు సంవత్సరాల క్రితం సమీపంలోని దామర చెరువు గ్రామానికి చెందిన కొత్తపల్లి సంగమేష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వివాహమైన అనంతరం అదనపు కట్నం కోసం సంగమేష్ ప్రమీలను వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలోనే మూడేళ్ల క్రితం ధనుష్ , ఇటీవల మరో కుమారుడు జన్మించడంతో కొద్ది రోజుల క్రితం బారసాల నిర్వహించి, బాబుకు సూర్యవంశీ అని నామకరణం చేశారు. ఈనెల 1న ప్రమీల అత్తవారింటికి పిల్లలతో సహా వచ్చింది. ఈనెల 4న సంగమేశ్, భార్య ప్రమీల, ఇరువురు చిన్నారులను నిజాంపేటలోని పుట్టింటికి తీసుకువచ్చి వదిలి వెళ్లాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ప్రమీల తల్లిదండ్రులు సాయమ్మ, రాములు, సోదరుడు జైపాల్ పొలం పనులకు వెళ్లగా, ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో కుమారులు ధనుష్(3), సూర్యవంశీ(45రోజులు)లను ఊపిరి ఆడకుండా గొంతునులిమి హత్య చేసి ఆమె కూడా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పొలం పనులకు వెళ్లిన కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం తిరిగి రావడంతో ప్రమీల, ఆమె ఇరువురుచిన్నారులు చనిపోయి ఉన్నారు. దీంతో భర్త సంబంధికులే ఆమెను హత్య చేసి ఉంటారని, ఆమె కుటుంబ సభ్యులు అనుమానించడంతో క్లూస్‌టీంతో పాటు డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. ప్రాథమికంగా ఆమె కుటుంబీకులు తెలిపిన ప్రకారం భర్త సంగమేష్ అధనపు కట్నం కోసం వేధించడమే కాకుండా అనుమానం వ్యక్తం చేయడంతోనే జీవితం విరక్తి చెంది ఆమె చిన్నారులను హతమార్చి, తాను ఆత్మహత్య చేసుకుందని, మృతురాలి తండ్రి బూసి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంగమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ప్రమీలతో పాటు చిన్నారుల శవాలను నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలలో శవ పరీక్ష చేయించారు.

వర్షాలతో రూ. 13.5 కోట్ల నష్టం


మాట్లాడుతున్న టీజీఎస్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలతో మెదక్ జిల్లాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని పునరుద్ధరించేందుకు వేగంగా చేస్తున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి తెలిపారు. శనివారం ఎస్ఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా గత నెల 26 నుంచి 30 వరకు కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లా పరిధిలోని 115 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. అధికార యంత్రాంగం 24 గంటల్లోపు 110 గ్రామాలకు విద్యుత్‌ను పునరుద్ధరించారని తెలిపారు. వర్షాలతో రూ. 13.5 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. వరదలతో వ్యవసాయ సరఫరాలో కొంత ఇబ్బందులు తలెతాయి. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో పునరుద్ధరణ జరగాల్సి ఉందని స్థానిక పిల్లికొట్టాల్ సబ్ స్టేషన్‌కు నీట మునిగిందని, దానికి మెదక్ పట్టణంలోని దుర్గా కాలనీలో స్థలాన్ని కేటాయించామన్నారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు పట్టణంలోని హల్దీవాగు, పసుపులేరు, మంజీరా వాగులతోపాటు ఎనిమిది ప్రాంతాల్లో 25 ప్రత్యేక టవర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 6.09 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగమవుతందని ఆయన వెల్లడించారు.

ప్రాణం తీసిన నిర్లక్ష్యం

- షాపింగ్‌మాల్‌లో విద్యుత్‌షాక్‌తో కార్మికుడి మృతి
- అసంపూర్తి వైరింగ్‌తో ప్రాణనష్టం


వీర్‌శెట్టి(ఫైల్)

సదాశివపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొత్త షాపింగ్‌మాల్‌లో జరిగిన నిర్లక్ష్యం ఓ నిండుప్రాణాన్ని బలిగొంది. షాపింగ్‌మాల్‌లో పనిచేసేందుకు వచ్చిన సిబ్బందికి కరెంటు తీగలు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై సంఘటన స్థలంలోనే ప్రాణాలను వదిలాడు. దసరా, దీపావళి పండుగలు సమీపిస్తున్న సందర్భంగా హడావిడిగా విద్యుత్‌పరమైన పనులను పూర్తిచేయకముందే షాపింగ్ మాల్ ప్రారంభించడానికి యాజామాన్యం సన్నాహాలు చేసింది. షాపింగ్‌మాల్‌లో పనిచేయడానికి వచ్చిన సదాశివపేట మండలం ఎల్లారం గ్రామానికిచెందిన వీర్‌శెట్టి శనివారం మధ్యాహ్నం విద్యుత్ షాక్ తగిలి మరణించాడు. ఈప్రమాదం ఎవరికి తెలియకుండా యాజమాన్యం జాగ్రత్త పడింది. మధ్యవర్తుల సహాయంతో మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా అతడి సొంతఊరికి తరలించారు. వీర్‌శెట్టికి భార్య నర్సమ్మ, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పేదరికంలో ఉన్న తమను ఆదుకోవాలని మృతుడి కుటుంబీకులు గ్రామపెద్దలను కోరారు. ఈ విషయమై స్థానిక సీఐ వెంకటేశాన్ని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి

నర్సాపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లో ఓ మహిళ అస్వస్థతకు గురై చనిపోయింది. కల్లుకాంపౌండ్ సమీపంలో పడి ఉన్న మహిళను ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై లింగం తెలిపారు. శనివారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న నర్సాపూర్ కల్లు కాంపౌండ్ వాల్ వద్ద గుర్తుతెలియని సుమారు 50 నుండి 55 ఏళ్ల ఉన్న మహిళ స్పృహ కోల్పోయి పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు నర్సాపూర్ ఆసుపత్రిలో చేర్పించి అక్కడి నుంచిమెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎవరైనా మహిళ మిస్సింగ్ అని కంప్లైంట్ ఇచ్చి ఉంటే నర్సాపూర్ పోలీసులను సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పటాన్‌చెరు సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుత్బుల్లాపూర్ మున్సిపల్ పరిధి ఐడీపీఎల్ కాలనీకి చెందిన ప్రవీణ్ (22) ఇంటర్ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నాడు. చిట్కుల గ్రామంలో పిన్ని మాధవి ఇంట్లో రెండు నెలలుగా ఉంటున్నాడు. శనివారం తెల్లవారు జాము సమయంలో ఇస్నాపూర్ డైమండ్ హోటల్ వద్ద రోడ్డు దాటుతుండగా ట్రావెల్ బస్సు ఢీకొట్టగా అక్కకక్కడే మరణించాడు. అన్న నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పాముకాటుతో వ్యక్తి..


పులి ఆగమయ్య(ఫైల్)

వెల్దుర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో ఓ వ్యక్తి మృతిచెందాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శేరి గ్రామానికి చెందిన పులి ఆగమయ్య(49) రోజులాగే శనివారం తన గేదెలను మేత కోసం గ్రామ సమీపంలోకి తోలుకెళ్లాడు. అయితే ఆగమయ్య నీరు తాగడానికి ఓ వ్యవసాయ బోరు వద్దకు వెళ్లగా పాము కాటు వేసింది. దీంతో అతడు స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబసభ్యులకు సమాచారమందించారు. చికిత్స నిమిత్తం వారు మండలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

స్క్రాప్ దుకాణం సీజ్

జహీరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని హమాలీ కాలనీలోగల స్క్రాప్ దుకాణాన్ని శనివారం సీజ్ చేశామని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనావాసాల మధ్య దుకాణాలను ఏర్పాటు చేయడమే కాకుండా వ్యర్థాలను అక్కడే వేసి కాల్చివేస్తున్నారు. దీని వల్ల దుర్గంధంతో పాటు వాయుకాలుష్యం ఏర్పడుతుందని ప్రజల ఫిర్యాదు మేరకు సీజ్ చేసినట్లు తెలిపారు.

నిమజ్జనానికి ట్రాక్టర్ ట్రాలీ కడుగుతుండగా షాక్

- ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

మద్దూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినాయకుడి విగ్రహ నిమజ్జనం కోసం ట్రాక్టర్ ట్రాలీని కడుగుతుండగా, విద్యుత్ షాక్‌కు గురై ఒకరు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పుప్పాల బాలస్వామికి చెందిన ట్రాక్టర్‌పై అదే గ్రామానికి చెందిన ఏలూరి శ్రీరామ్ అలియాస్ బన్నీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి ఎస్సీ కాలనీలో ప్రతిష్ఠించి వినాయక విగ్రహం నిమజ్జనం చేసేందుకు గ్రామ శివారులోని నీటి తొట్టి వద్ద మట్టితో ఉన్న ట్రాక్టర్ ట్రాలీని పైకి లేపి పైపుతో కడుతుండగా, పైన ఉన్న విద్యుత్ వైర్‌కు శ్రీరాం తగిలాడు. దీంతో కరెంట్ షాక్ కొట్టి కింద పడిపోయాడు. ట్రాలీని పట్టుకున్న ట్రాకర్ యజమాని బాలస్వామికి సైతం విద్యుత్ షాక్ తగడంతో అరుస్తూ స్పృహ తప్పి పడిపోయాడు. గ్రామస్తులు వెళ్లి ఇద్దరిని ఆస్పత్రికి తరలించేందుకు 108కు కాల్ చేశారు. వచ్చిన స్థానిక అంబులెన్స్‌లో వారిని చేర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దారి మధ్యలోనే ఏలూరి శ్రీరాంకు సీపీఆర్ చేస్తూ తీసుకెళ్లారు. ఆస్పత్రిలో వైద్యులు పరీక్షలు చేస్తుండగానే శ్రీరాం చనిపోయాడు. పుప్పాల బాలస్వామి పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచన మేరకు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బ్యాంక్‌కు వెళ్లిన యువకుడు అదృశ్యం


బుడ్డ శ్రీను (ఫైల్)

తూప్రాన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువకుడు బ్యాంకుకు వెళ్లి అదృశ్యమయ్యాడు. బుధవారం ఇంటి నుంచి బ్యాంకుకు వెళ్లి కనిపించకుండా పోయాడు. మూడు రోజులుగా ఆచూకి లభించకపోవడంతో తల్లి పోలీసులను ఆశ్రయించింది. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన బుడ్డ శ్రీను (35)కు 15 ఏళ్ల క్రితం హేమలతతో వివాహం కాగా, ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబ సమస్యల కారణంగా దంపతుల మధ్య గొడవలతో హేమలత 6నెలల క్రితం పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం మాసాయిపేట బ్యాంకుకు వెళ్తున్నట్లు తల్లి సుశీలతో చెప్పి శ్రీను ఇంట్లోంచి వెళ్లిపోయాడు. మూడు రోజులు గడిచి పోయినప్పటికీ శ్రీను ఆచూకి లభించలేదు. చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకి లభించకపోవడంతో శనివారం తల్లి సుశీల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం వివరించారు.

ఆరోగ్య కేంద్రంలో అసంపూర్తి పనుల కోసం ప్రతిపాదనలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జిన్నారం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏడాదిగా ప్రారంభానికి నోచుకోని నూతన ఆరోగ్య కేంద్రంపై ఆంధ్రజ్యోతి కథనానికి డీఎంహెచ్‌వో స్పందించారు. జిన్నారంలో 1.56 కోట్లతో నిర్మించిన నూతన ఆరోగ్య భవనం ఏడాదిగా ప్రారంభానికి నోచుకోక పోవటంతో ఈ నెల 6 ఇటు వృదా.. అటు వృధా శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది. ఈ కథనానికి స్పందించిన జిల్లా డీఎంహెచ్‌వో నాగ నిర్మల జిన్నారం పీహెచ్‌సీ డాక్టర్ నుంచి వివరాలు సేకరించామన్నారు. కొత్తగా నిర్మించిన ఆరోగ్య భవనంలో అసంపూర్తిగా ఉన్న సానిటేషన్, ఫ్లంబింగ్, విద్యుత్, సెప్టిక్‌ట్యాంక్, అప్రోచ్ రోడ్డు పనులు చేయాల్సి ఉందన్నారు. వీటి కోసం మరో 18 లక్షల నిధులు అవసరం కాగా ఇంజినీరింగ్, పాలన విభాగం ద్వారా ఆయా పనుల నిర్వాహణ ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అసంపూర్తి పనులు పూర్తి కాగానే నూతన భవనంలో వైద్య సేవలు అందిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

కార్మికనేత జి.ఎల్లయ్యకు కన్నీటి వీడ్కోలు

- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు.. కార్మికులు


ఎల్లయ్య పార్థీవదేహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

భెల్‌కాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రసాధన పోరాటంలో క్రియాశీలక పాత్ర వహించిన ఉద్యమకారుడు..కార్మిక హకుల పోరాటయోధుడు జి.ఎలయ్యకు శనివారం కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన అంత్యక్రియలకు వేలాదిమంది అభిమానులు, బీహెచ్ఈఎల్ కార్మికులు హాజరయ్యారు. రామచంద్రాపురం స్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. జాతీయ ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా, బీహెచ్ఈఎల్ కార్మిక సంఘనేతగా పేరొంది.. కార్మిక హక్కుల సాధన కోసం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసిన నేతకు వీడ్కోలు పలికేందుకు వేలాదిగా తరలివచ్చారు. శుక్రవారం ఉదయం ఆయన మృతి చెందగా, బీహెచ్ఈఎల్ ఎంఐజీకాలనీలో గల స్వగృహానికి పార్థీవదేహాన్ని తరలించి, కాలనీవాసులు, అభిమానుల దర్శనార్థం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్, నాయకులు కాటా శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, శనివారం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఉద్యమకారుడు..పోరాటయోధుడు

మరణం తీరని లోటు : హరీష్‌రావు


తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పోషించిన పాత్ర, కార్మికుల హక్కుల కోసం జి.ఎల్లయ్య నిరంతర పోరాటాలు చేశారు. పరిశ్రమ చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతాయని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.











'పర్ష'వారి పల్లె

ఊరంతా ఒకే కుటుంబం

- ఆరుగురి అన్నదమ్ములతో మొదలైన గ్రామం
- నేడు 78 కుటుంబాలు.. 380 మంది జనాభా
- వారింటిపేరే ఊరిపేరైన వైనం
- నాడు జోడుచెర్ల నేడు పర్షరాంనగర్

సండే స్పెషల్

ఆ ఊరంతా ఒకే కుటుంబానికి చెందినవారు.. ఒకప్పుడు ఆరుగురు అన్నదమ్ములతో మొదలైన ఆ గ్రామం.. నేడు 78 కుటుంబాలు, 380 మంది జనాభాగా విస్తరించింది. ఫలితంగా వారి ఇంటిపేరే ఆ ఊరిపేరుగా మారింది. రజాకార్ల వేధింపుల కారణంగా పురుడుపోసుకున్న ఆ గ్రామ అప్పటి, ఇప్పటి పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

-దుబ్బాక, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి)

పచ్చని అడవులు, ఆహ్లాదకరమైన గుట్టల మధ్య, రెండు చెరువులతో జీవనోపాధిని పొందిన ఒక కుటుంబం.. ఆరుగురు అన్నదమ్ములతో మొదలై ఇప్పుడు ఆ ఊరంతా వారి ఇంటి పేరుతో నిండిపోయింది. అదే దుబ్బాక మండలం, మల్లన్నగుట్టలు అడవిలో ఉన్న పర్షరాంనగర్. గతంలో 'జోడుచెర్ల' పిలవబడిన ఈ గ్రామం, ప్రస్తుతం పర్ష ఇంటిపేరుతో ముదిరాజ్ కులస్తులు మాత్రమే నివసించే ఒక ప్రత్యేక గ్రామంగా రూపాంతరం చెందింది.

ఊరు పురుడు పోసుకున్నదిలా..

పెద్దచీకోడు గ్రామపంచాయతీ అచ్చుమాయిపల్లి మదిర గ్రామం నుంచి అడవిలో పండ్లు, ముఖ్యంగా సీతాఫలాలను సేకరించుకునే ఆరుగురు అన్నదమ్ముల ముదిరాజ్ కుటుంబం ఇక్కడికి వలస వచ్చింది. మొదటగా జోడుచెర్ల వద్ద వ్యవసాయ పనుల కోసం అచ్చుమాయిపల్లి గ్రామం నుంచి అడవిలోకి వెళ్లే తమ భర్తలకు భార్యలు సద్దిమూటలు తీసుకెళ్లేవారు. ఇలా రోజూ వెళ్లడం చూసిన రజాకార్లు.. ఉద్యమకారులకు ఆహారం అందిస్తున్నారని భావించి వారిని అడ్డుకున్నారు. దీనితో విసిగిపోయిన ఆ కుటుంబం, తాము సాగు చేసుకుంటున్న జోడుచెర్ల ప్రదేశంలోనే గుడిసెలు వేసుకుని నివాసం ప్రారంభించారు. కాలక్రమేణా ఆ ప్రాంతం పర్షవారితో విస్తరించి, పర్షరాంనగర్‌గా పేరు పొందింది. ప్రస్తుతం ఈ గ్రామంలో 78 కుటుంబాలు, 380 మంది జనాభా ఉన్నారు. అందరూ ఒకే కుటుంబానికి చెందిన పర్ష ఇంటి పేరుగల ముదిరాజ్ కులస్తులే. పెద్దచీకోడు రెవెన్యూ గ్రామంగా ఉన్న ఈ గ్రామంలో 695 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఇందులో ప్రతి ఒక్కరికీ భూమి ఉండటం విశేషం.

38 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు..

2001 వరకు ఈ గ్రామం పెద్దచీకోడు గ్రామ పంచాయతీలో ఒక వార్డుగా కూడా ఉండేది కాదు. మొదటిసారిగా ఈ గ్రామానికి అడుగు పెట్టిన ప్రజాప్రతినిధి అప్పటి దొమ్మాట ఎమ్మెల్యే (ప్రస్తుతం దుబ్బాక) సోలిపేట రామలింగారెడ్డి.



ఇటీవల నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లు

నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో చాలా మంది వెళ్లడానికి జంకారు. కానీ రామలింగారెడ్డి 2004లో ఎమ్మెల్యే అయిన మూడు రోజులకే జర్నలిస్టులతో కాలినడకన ఈ గ్రామాన్ని సందర్శించారు. ఆయన నాబార్డ్ ద్వారా రహదారిని నిర్మింపజేశారు. 2010లో అప్పటి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను తీసుకుని వచ్చి, చిన్నచీకోడు నుంచి ఈ గ్రామానికి వంతెన మంజూరు చేయించారు. 2015లో ఈ గ్రామానికి 38 డబుల్ బెడ్రూమ్ ఇళ్లను మంజూరు చేయించి, నిర్మించి, మంత్రి హరీశ్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో గృహప్రవేశాలు చేయించారు.

కొత్త గ్రామ పంచాయతీగా ప్రయత్నాలు

ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పర్షరాంనగర్‌ను కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్థులతో కలిసి మంత్రి సీతక్కను కూడా కలిశారు. ఎన్నికల నోటిఫికేషన్ లోపు కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు జరిగితే పర్షరాంనగర్ ఒక ప్రత్యేక పంచాయతీగా రూపుదిద్దుకుంటుంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారుల నుంచి సిద్ధం చేయించి, గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వానికి అందజేశారు.

రెండు చెరువులకు ఒకే కట్ట..

నిజాం రాజులు వేటకు వెళ్లినప్పుడు, కొండల మధ్య ప్రవహించే నీటిని నిలపడానికి ఒకే గట్టుతో రెండు చెరువులను నిర్మించారు. ఈ ప్రదేశం అడవిలో ఉన్నందున దీనిని జోడుచెరువులు అని పిలిచేవారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, ముస్తాబాద్ మండలం చిన్నచీకోడు గ్రామానికి సరిహద్దుగా ఇది ఉండేది.



వేంకటేశ్వరుడికి అరుణార్చన

● స్వామివారిని తాకిన సూర్యకిరణాలు



అల్లాదుర్గం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గంలోని శ్రీ వేంకటేశ్వరాలయంలో శనివారం ఉదయం ఒక అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. సూర్యోదయ సమయంలో సూర్యకిరణాలు నేరుగా గర్భగుడిలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి భుజాలను తాకాయి. ఈ అద్భుత దృశ్యాన్ని చూసి ఆలయ పూజారి శిలాంకోట ప్రవీణ్ శర్మతో పాటు భక్తులు ఆశ్చర్యపోయారు. సాధారణంగా సూర్యకిరణాలు స్వామివారి పాదాలపై పడటం చూస్తుంటాం, కానీ భుజాలపై తాకడం అరుదని భక్తులు చర్చించుకున్నారు. అనంతపద్మనాభ స్వామి జయంతి సందర్భంగా ఈ అద్భుత ఘట్టం చోటుచేసుకోవడం విశేషం. ఈ దృశ్యాన్ని చూడటం భక్తులు తమ అదృష్టంగా భావించారు. పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

తారా అధ్యాపకురాలికి జాతీయ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న అధ్యాపకురాలు డాక్టర్ విజయ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ విజయకు 'సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ పురస్కారం' లభించింది. బోధనలో నూతన పద్ధతులను అనుసరించినందుకు, 25 ఏళ్ల పాటు విశేష సేవలందించినందుకుగాను నీతి ఆయోగ్ మరియు ఐఏఆర్‌డీవో సంయుక్తంగా ఈ అవార్డుకు ఆమెను ఎంపిక చేశాయి. శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

తండ్రి కార్మికుడు.. తనయుడు పైలట్

● 19 ఏళ్లకే కమర్షియల్ పైలట్‌గా అర్హత



శిక్షణ కేంద్రంలో అభిలాష్

బెల్ కాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పైలట్ కావడానికి ప్రయాణాన్ని ప్రారంభించడం సాహసోపేత నిర్ణయమైనప్పటికీ, కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదని నిరూపించాడు 19 ఏళ్ల యువకుడు. వృత్తిపై అంకిత భావం, పైలట్ అవ్వాలనే ఆకాంక్ష, కఠినమైన శిక్షణను సైతం పూర్తి చేసి నేడు కమర్షియల్ పైలట్‌గా అర్హత సాధించాడు. మెదక్ జిల్లా దుబ్బాక మండలం లచ్చపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్, బీహెచ్ఈఎల్ పరిశ్రమలోని 01 బ్లాక్ రోటర్ షాప్ విభాగంలో పనిచేస్తున్నారు. శ్రీనివాస్ పెద్ద కుమారుడు అభిలాష్ బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో గల భారతీయ విద్యాభవన్ పాఠశాలలో పదవ తరగతి వరకు చదివి అనంతరం శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో 2023లో ఎంపీసీ పూర్తి చేశారు. అయితే చిన్నతనం నుంచే హుషారుగా ఉంటూ క్రీడల్లో సత్తా చాటడంలో, అన్ని రంగాలపై ఆసక్తి కనబరచడంతో తల్లిదండ్రులు సైతం ప్రోత్సహిస్తూ వచ్చారు. దీంతో క్రికెట్‌లో రాష్ట్ర స్థాయి క్రీడాకారుడిగా మంచి గుర్తింపు సాధించాడు. కాగా, పైలట్ దుస్తులు, ఆ దర్పం, నిత్యం ఎగురుతున్న విమానాలను చూడడం, ప్రతి ఒక్కరూ పైలట్‌లను గొప్పగా గౌరవించడాన్ని చిన్నతనం నుంచే అభిలాష్‌ను ఆకర్షించింది. నాన్నా నేను పైలట్ అవుతా... అన్న కుమారుడి కోరికకు తల్లిదండ్రులకు ఆశ్చర్యం కలిగించింది. అయితే ఆకాంక్షను నెరవేర్చేందుకు తల్లిదండ్రులు సైతం సహకరించి, ప్రోత్సహించడంతో నేడు కమర్షియల్ పైలట్‌గా అర్హత సాధించాడు. డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) నిర్వహించిన అర్హత పరీక్షలను రాసి ఉత్తీర్ణత సాధించాడు. కమర్షియల్ పైలట్ కావాలంటే సివిల్ ఏవియేషన్ జనరల్ పెట్టే పరీక్షలు పాసవ్వడంతో పాటు శారీరక, మానసిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి. దీంతో శ్రీలంక దేశంలో పేరొందిన రెడ్ బర్డ్ ఏవియేషన్ అకాడమీలో శిక్షణలో చేరాడు. థియరీ పూర్తి చేశాక, విమానం నడిపే అనుభవం కోసం రెడ్ బర్డ్ ఏవియేషన్ అకాడమీలో చేరి 15 నెలల శిక్షణ తీసుకుని విమానం ఎగురవేసే అనుభవాన్ని సాధించాడు. చివరగా 20 ఎగ్జామ్స్ రాసి 200 గంటల ఫ్లయింగ్ అవర్స్‌తో కమర్షియల్ పైలట్‌గా అర్హతను సంపాదించాడు. కార్మికుడి కుమారుడు చిన్నవయస్సులోనే పైలట్‌గా విజయం సాధించడం పట్ల బీహెచ్ఈఎల్ యాజమాన్యం, తోటి కార్మికులు అభినందనలు తెలిపారు. అభిలాష్ సాధించిన విజయానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

యూరియా కోసం రైతుల బారులు



నర్సాపూర్ ఆగ్రోస్ కేంద్ర వద్ద గుమిగూడిన రైతులు

నర్సాపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల తర్వాత నర్సాపూర్‌కు ఒక లారీ యూరియా రావడంతో పెద్ద సంఖ్యలో రైతులు దాని కోసం పోటీపడ్డారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, రైతులను క్యూలో నిలబెట్టి యూరియా బస్తాల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. మొదట వ్యవసాయ శాఖ సిబ్బంది ఇచ్చే టోకెన్ల కోసం పోటీపడ్డారు. లారీలో ఉన్న యూరియా తక్కువ కావడంతో, తమకు కనీసం ఒక్క సంచి అయినా దక్కించుకోవాలనే ఆతృతతో రైతులు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరారు.



ఆలయం ఆవరణలో ఒత్తులు వెలిగించుకుంటున్న భక్తులు

ఘనంగా అనంత చతుర్దశి



సంజీవనరావుపేటలో కొలువుదీరిన అనంత శయనుడు

నారాయణఖేడ్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంజీవనరావుపేటలో శనివారం అనంత చతుర్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతశయన మందిరాలు చాలా అరుదుగా ఉంటాయి. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవనరావుపేటలో పురాతనమైన అనంతశయన మందిరం ఉండడంతో గ్రామస్థులు ఇటీవల ఆలయాన్ని ఆధునీకరించారు. అనంత చతుర్థి ఉత్సవాలను పురస్కరించుకొని ఉదయం పురోహితులు ప్రవీణ్ చారి, నారాయణఖేడ్‌కు చెందిన మోహన జ్యోషి, మనోజ్ జ్యోషిలు అభిషేకం, అలంకరణ పూజ కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి ఒత్తులు వెలిగించుకున్నారు. అనంత చతుర్దశి సందర్భంగా ప్రతి రోజు ఒక్కో దారం పోగుతో సంవత్సరానికి 365 పోగులతో ఒత్తిని చేసి వెలిగించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సాయిరెడ్డి, నర్సింలు, సంజీవరెడ్డి, భూపాల్, శంకర్ రావు, కిష్టయ్య తదితరులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు మహాప్రసాదాన్ని అందించారు.

ఆయిల్ ఫామ్ సాగుతో ఆదాయంపై భరోసా

● రాష్ట్ర ఉద్యానవన శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాషా



చిన్నగొట్టిముక్లలో ఆయిల్ పామ్ మొక్కను నాటుతున్న రాష్ట్ర ఉద్యాన శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాషా

శివ్వంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయానికి భరోసా ఉంటుందని రాష్ట్ర ఉద్యానవన శాఖ సంచాలకురాలు షేక్ యాస్మిన్ భాషా, కలెక్టర్ రాహుల్ రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్న గొట్టిముక్ల గ్రామంలో మాజీ సీఎంవో ముఖ్య కార్యదర్శి నర్సింగరావు వ్యవసాయ క్షేత్రంలో 50 ఎకరాల్లో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌ను ప్రారంభించి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ నాటినప్పటి నుంచి నాలుగు సంవత్సరాల నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాన్ని గడించవచ్చని తెలిపారు. కలెక్టర్ రాహుల్ రాజు మాట్లాడుతూ రైతులకు లాభదాయకమైన ఆయిల్ పంట సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి చారి, ఏవో లావణ్య తదితరులు ఉన్నారు.

పోలీసులు దాడి చేశారని వినాయకులతో ధర్నా



హుస్నాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు తమపై అకారణంగా దాడి చేశారంటూ హుస్నాబాద్ పట్టణంలోని బస్‌డిపో రోడ్డులో గోదాంగడ్డకు చెందిన యువకులు శనివారం వినాయకులతో ధర్నా చేశారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు పోలీసులు మాట్లాడుతూ శోభాయాత్రలో డీజే పెట్టి అర్ధరాత్రి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తుండటంతో డీజే మిషన్ తీసుకెళ్లామని తెలిపారు. అయినా మరో డీజే మిషన్ తీసుకువచ్చి న్యూసెన్స్ చేయడంతో బెదిరించాల్సి వచ్చిందని చెప్పారు. ధర్నా స్థలానికి ఏసీపీ సదానందం చేరుకుని వారికి నచ్చజెప్పి పంపించారు.

లడ్డూ అధరహో

● వేలంలో పోటీపడి దక్కించుకున్న భక్తులు ● రుద్రారంలో రూ. 7లక్షలు



రుద్రారంలో రూ.7లక్షలకు లడ్డూను దక్కించుకున్న బాలగౌని సాయిచరణ్

కంది, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కంది మండలం ఎద్దుమైలారం గ్రామ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో లడ్డూను రూ.3,35,001లకు మాజీ ఎంపీటీసీ వడ్ల వరుణ్ కుమార్ దక్కించుకున్నారు. ఈ సంవత్సరం కంది మండలంలోనే ఇది అత్యధిక ధరగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ కుమార్‌ను, ఆయన కుటుంబాన్ని మాజీ సర్పంచ్ కాసాల మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కాల్వ సరళ పుల్లారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

● శివ్వంపేట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్న గొట్టిముక్ల గ్రామంలోని వినాయకుడి లడ్డూను మూడోసారి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సింగాయిపల్లి గోపి రూ.1.50లక్షలకు దక్కించుకున్నారు.

● రామాయంపేట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రామాయంపేటలోని వైశ్య సంఘం ఏర్పాటు చేసిన గణేష్ లడ్డూను 'డోంట్ టచ్ గ్యాంగ్' రూ.లక్షలకు దక్కించుకున్నది.

● పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రుద్రారం గణేష్ గడ్డ స్వయంభుగా వెలసిన సిద్ధి వినాయక ఆలయంలో గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని వినాయకుడి మూడు లడ్డూలకు వేలంపాట నిర్వహించారు. మొదటి లడ్డూను తెల్లాపూర్ మున్సిపాలిటీ, ఈదుల నాగులపల్లికి చెందిన యువనేత సాయిచరణ్ గౌడ్ రూ.7 లక్షలకు దక్కించుకున్నారు. రెండో లడ్డూను రామచంద్రాపురం పట్టణానికి చెందిన వరుణ్ రూ.3.40లక్షలు, మూడో లడ్డూ రుద్రారం గ్రామానికి చెందిన పట్నం రామారావు రూ.2.50 లక్షలకు దక్కించుకున్నారు.

లడ్డూను దక్కించుకున్న ముస్లింలు



లడ్డూ దక్కించుకున్న అత్తు ఇమామ్

కంగ్టి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కంగ్టి మండలం తుర్కవడగాంలో గణపతి లడ్డూను వేలంపాట ద్వారా ముస్లిం యువకుడు రహీం దక్కించుకొని మతసామరస్యాన్ని చాటారు. వృత్తి రీత్యా చికెన్ సెంటర్ నడుపుతున్న రహీం, లడ్డూపై ఉన్న అపారమైన విశ్వాసంతో రూ. 23,000లకు సొంతం చేసుకున్నారు. ఈ ప్రసాదాన్ని గ్రామ పురోహితుడు శ్రీనివాస్ మహరాజ్ స్థానిక సాయిబాబా ఆలయంలో రహీంకు అందజేశారు.

● ములుగు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మతాలకతీతంగా ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను ముస్లిం యువకుడు మహమ్మద్ జహంగీర్ రూ. 80,100 దక్కించుకున్నారు.

● సిద్దిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని తొమ్మిదో వార్డులో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఐదవసారి లడ్డూను దక్కించుకున్నారు. రూ.51,116 వేలకు కైవసం చేస్తున్నారు.

నేడు ఆలయాల మూసివేత

పాపన్నపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఏడుపాయల వన దుర్గా భవాని మాత దర్శనం తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనం కల్పించి, ఆ తర్వాత ఆలయాన్ని మూసివేస్తామని చెప్పారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు ఆలయ సంప్రోక్షణ పూర్తయ్యాక, దర్శనం యధావిధిగా కొనసాగుతుందని, భక్తులు గమనించాలని సూచించారు. కాగా, మూడు వారాలుగా మంజీర నది ఉప్పొంగడంతో దుర్గామాత ఆలయం మూసివేసి, రాజా గోపురంలో దర్శనం కల్పిస్తున్న విషయం తెలిసిందే.

● ఝరాసంగం/ కోహీర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఝరాసంగం శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని కూడా ఆదివారం ఉదయం 11 గంటలకు చంద్రగ్రహణం సందర్భంగా మూసివేయనున్నట్లు ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. అలాగే కోహీర్ మండలం బడంపేటలోని శ్రీ రాచన్న స్వామి దేవాలయం ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సోమవారం ఉదయం వరకు మూసివేయబడుతుందని వెల్లడించారు. గ్రహణం ముగిశాక సోమవారం ఉదయం సంప్రోక్షణ కార్యక్రమం తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తామని, భక్తులు సహకరించాలని కోరారు.

● జగదేవ్‌పూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ దేవాలయాన్ని ఆదివారం మూసివేస్తున్నట్లు చైర్మన్ అనుగీత, ఈవో మోహన్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు మూసివేసి సోమవారం ఉదయం 8 గంటలకు సంప్రోక్షణ అనంతరం గుడి తెరవడం జరుగుతుందని వారు తెలిపారు.


కంగ్టిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


రామాయంపేట సర్వయ్యకుంటలో వినాయకుల నిమజ్జనం


సదాశివపేట : నిమజ్జనాలను ప్రారంభిస్తున్న పులిమామిడి రాజు

గంగమ్మ ఒడికి గణనాథులు


కోహీర్‌లో సర్వజనిక్ విఘ్నేశ్వరుడిని నిమజ్జనంలో భక్తులు

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకున్నారు. మహిళల కోలాటాలు, యువకుల కేరింతల నడుమ శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. పిల్లలు తీన్మార్ డ్యాన్సులతో హోరెత్తించారు.

- న్యూస్ నెట్‌వర్క్


చేగుంటలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు


అల్లాదుర్గంలోని చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న మహిళా భక్తులు


చిన్నశంకరంపేటలో వినాయక శోభాయాత్ర


పెద్దశంకరంపేటలో నిమజ్జనంలో యువకుల డ్యాన్స్


వెల్దుర్తిలో నిర్వహిస్తున్న వినాయకుల శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుపై విచారణ

చేగుంట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం చందాయిపేట్ గ్రామానికి చెందిన ఆవుబోతు ఎల్లంకు మనోహరాబాద్ మండలానికి చెందిన ఓ మహిళతో కూలి పనిచేస్తుండగా పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి సదరు మహిళ అతని వద్దే ఉంటుంది. అయితే తరచూ వేధింపులకు గురిచేయడంతో మహిళ తండ్రి పోతు రాజు రవి 3న చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. శనివారం డీఎస్పీ నరేందర్‌గౌడ్ చందాయిపేట సందర్శించి విచారణ చేపట్టారు.

మత్స్య సహకార సంఘం ఏర్పాటుకు ఆమోదం

జిన్నారం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మున్సిపాలిటీ ఊట్ల పరిధిలోని దాదిగూడెం గ్రామ మత్స్య సహకార సంఘం ఏర్పాటుకు ప్రభుత్వం ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు సంఘం జిల్లా డైరెక్టర్ మహేష్ తెలిపారు. సంఘం నాయకులకు కాంగ్రెస్ నాయకుడు నీలం మధు చేతుల మీదుగా ప్రొసీడింగ్స్ కాపీని అందజేశారు.

కార్మికుడికి పరిహారం చెల్లించాలి

పటాన్‌చెరు, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : గాయపడిన అమర్‌సింగ్ కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు కోరారు. శనివారం పటాన్‌చెరు పారిశ్రామిక వాడ సాయిబాబా సెల్యులోజ్ పరిశ్రమ వద్ద ధర్నా చేసి మాట్లాడారు. పరిశ్రమలో 20ఏళ్లుగా పనిచేస్తున్న అమర్‌సింగ్ యంత్రంలో రసాయనాలు కలుపుతుండగా కుడిచేతిని యంత్రం లోనికి లాక్కుందని చెప్పారు. తీవ్రంగా గాయపడిన అమర్ సింగ్‌ను ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. పరిశ్రమ యాజమాన్యం వైద్యానికి ఖర్చులు భరించడమే కాకుండా నష్టపరిహారం చెల్లించాలన్నారు.

'భూభారతి'తో సమస్యలు పరిష్కారం

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : భూభారతితో ఏళ్ల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ మాలతి అన్నారు. శనివారం చిన్నశంకరం పేట తహసీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలు పరిష్కరించిన రైతులకు పట్టా సర్టిఫికెట్లు అందజేశారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

అల్లాదుర్గం, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యమని అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది జయలక్ష్మి విద్యార్థులకు సూచించారు. శనివారం సాంఘిక సంక్షేమ (బాలుర) వసతి గృహంలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

తూప్రాన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుతో ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు మేలు చేశారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జానకీరాంగౌడ్ ఆధ్వర్యంలో పాత హైవే రోడ్డుపై తహసీల్దార్ కార్యాలయం ఎదుట నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గరాజ్‌యాదవ్, నర్సోజీ తదితరులు పాల్గొన్నారు. జిన్నారంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ముగిసిన సిద్ధి గణపతి వార్షిక బ్రహ్మోత్సవాలు

- రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రుద్రారం సిద్ధి గణపతి ఆలయంలో వినాయక చవితిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించి, రథోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.


పల్లకీసేవలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు పాండు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రె‌స్‌కు బుద్ధిచెప్పాలి : మాజీ ఎమ్మెల్యే

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు అవుసుల భవానీనరసింహచారి, చీలపల్లి మాజీ ఎంపీటీసీ దామోదర్, పెద్దశంకరంపేట మాజీ వార్డుసభ్యులు హరికిషన్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీల నుంచి దాదాపు 200 మందికి పైగా కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలను మోసం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, నాయకులు బి.దత్తు, సురేష్‌గౌడ్, మాణిక్‌రెడ్డి, నీలకంటి విఠల్, రవీందర్, విఠల్‌గౌడ్ పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలి

- డీపీవో సాయిబాబా

కంది, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని డీపీవో (జిల్లా పంచాయతీ అధికారి) సాయిబాబా అన్నారు. కంది మండలం చిమ్నాపూర్‌లోని వైకుంఠధామం, నర్సరీ, పల్లెప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, క్రీడా ప్రాంగణాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డంపింగ్‌యార్డులో తడి, పొడి చెత్త వేరుగా సేకరించి ఎరువును తయారు చేయడం తప్పనిసరిగా చేయాలన్నారు.


చిమ్నాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో సాయిబాబా

డీపీవో వెంట ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శి సునీత, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

హరీశ్‌రావును కలిసి సునీతారెడ్డి


హరీశ్‌రావుతో సునీతారెడ్డి

నర్సాపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ముఖ్యనేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును హైదరాబాద్‌లోని స్వగృహంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి శనివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. కవిత హరీశ్‌రావుపై విమర్శలు చేసిన దరిమిలా లండన్ నుంచి తిరిగొచ్చిన హరీశ్‌రావును కలిసి పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. సునీతారెడ్డి వెంట మాజీ జడ్పీకోఆప్షన్ సభ్యుడు మన్సూర్, శివ్వంపేట మాజీ ఎంపీపీ హరికృష్ణ, నాయకులు గొర్రెవెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు చెల్లించండి


డీఎంహెచ్‌వో డా.నాగనిర్మలకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని కోరుతూ శనివారం ఉద్యోగులు డీఎంహెచ్‌వో డా.నాగనిర్మలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ జూలై, ఆగస్టు వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీనెల 1న వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సిద్ధార్థ్, రోహిణి, అర్విండ్, శ్రీనివాస్, సాయి, మధు, విష్ణు, జ్యోతి పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

- మెదక్ డీఎంహెచ్‌వో శ్రీరామ్


సర్దనలో ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీరామ్

హవేళిఘణపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వర్తించాలని మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ తెలిపారు. శనివారం మండలంలోని సర్ధన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా పల్లెల్లో జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నదని, కావున సిబ్బంది ఆశాలతో కలిసి ఎప్పటికప్పుడు జ్వర సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు నవ్య, హరిప్రసాద్, డాక్టర్ వినయ్, సిబ్బంది పాల్గొన్నారు.

మసీదు నిర్వహణ అప్పగించడంపై కోర్టు స్టే

నారాయణఖేడ్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ హష్మీమసీదు ప్రత్యక్ష నిర్వహణ బాధ్యతలను వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌కు కల్పిస్తూ వక్ఫ్‌బోర్డు ఉత్తర్వులివ్వడంపై హైకోర్టు స్టే ఇవ్వడం హర్షణీయమని మసీదు ముత్తవలి డాక్టర్ అబ్దుల్ మజీద్, సబ్ ముత్తావలి మోహీద్ ఖాన్, పట్టణ ముస్లిం పెద్దలు ముంతాజ్, తౌసిఫ్, జకిరియాఖురేషి, మీర్ సాజిద్అలీ, ఖదీర్, ఫయాజ్, ఖతీబ్, అజీం తెలిపారు. శనివారం వారు స్టే ఉత్తర్వులు చూపిస్తూ విలేకరులతో మాట్లాడారు. మసీదుకు 90 ఎకరాల భూములు ఉన్నాయని తెలిపారు. భూములను అన్యాక్రాంతం చేసేందుకు ఈ ప్రాంతంతో సంబంధం లేని వారు ప్రయత్నిస్తున్నారన్నారు. మసీదు భూములు, ఆస్తులపై కోర్టు ఇదివరకే ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చినా ప్రత్యక్ష బాధ్యతలను వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించడాన్ని సవాల్ చేయగా కోర్టు స్టే ఇచ్చిందని వివరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


పుల్‌కల్ : ఉత్తమ ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య


జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఇంగ్లిష్ టీచర్ రాధకు అవార్డు ప్రదానం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పుల్‌కల్/వెల్దుర్తి/మాసాయిపేట/అల్లాదుర్గం/చేగుంట/ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి విశేష సేవలందించిన చౌటకూర్ మండలం ఉప్పరిగూడెంకు చెందిన సి.మోహన్‌రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వెంకటేశ్వర్లు శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. వెల్దుర్తి, కుకునూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు వాణిశ్రీ, చందర్, బండపోసన్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన లింగం, శెట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ప్రవళిక, మాసాయిపేట మండలంలోని ఉన్నత పాఠశాల నుంచి రవికుమార్, ప్రాథమిక పాఠశాల నుంచి శిరీష, చెట్లతిమ్మాయిపల్లి పాఠశాల నుంచి స్వప్నశ్రీ, అల్లాదుర్గంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ముదిగొండ నాగరాజు, ముస్లాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు రాజరత్నం, చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు జీ.రాధ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్సీలు మల్కా కొమురయ్య, అంజిరెడ్డి, డీఈవో రాధాకిషన్ నుంచి అవార్డులు అందుకున్నారు.

స్థానికులకు అవకాశం ఇవ్వాలి: కాంగ్రెస్ నాయకులు

మనూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో స్థానికంగా ఉంటున్న అభ్యర్థులను ఎంపిక చేయాలని, లేకపోతే నిలబడిన అభ్యర్థులను ఓడిస్తామని కాంగ్రెస్ మండల నాయకులు పేర్కొన్నారు. శనివారం మనూరు మండలం తుమ్నూరు మాజీ సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడగానే జిల్లా కేంద్రంలో, హైదరాబాద్‌లో ఉంటున్న కొందరు ప్రముఖులు, న్యాయవాదులు ఎన్నికల్లో పోటీచేయడానికి ఆసక్తి చూపుతూ టికెట్ల కోసం పార్టీ అధి నాయకుల దగ్గర పైరవీలు కొనసాగిస్తారని, అలాంటి వారిని ఎంపిక చేస్తే తాము ఓడిస్తామన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా దీక్ష

కౌడిపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా దీక్ష ఎంపికయ్యారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో దీక్ష విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు దీక్ష మాట్లాడుతూ విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి చదువులో ప్రతిభ కనబర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.



ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంచాలకులు యోగితారాణి నుంచి అవార్డు అందుకుంటున్న దీక్ష

పెద్దారెడ్డిపేట, బస్వాపూర్‌లో రైతు వారోత్సవాలు

పుల్‌కల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దారెడ్డిపేట, బస్వాపూర్ గ్రామాల్లో బీకేఎస్ ఆధ్వర్యంలో శనివారం రైతు వారోత్సవాలను నిర్వహించారు. బలరామ జయంతిని పురస్కరించుకుని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.యాదగిరిరెడి జెండాను ఆవిష్కరించారు. వ్యవసాయం, కుటుంబ సంప్రదాయాలకు ప్రతిబింబమైన బలరామ జయంతి సందర్భంగా ప్రతీ గ్రామంలో రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీకేఎస్ మండల అధ్యక్షుడు జీల మహేష్‌బాబు ముదిరాజ్, పెద్దారెడ్డిపేట గ్రామ అధ్యక్షుడు శేఖర్, సభ్యులు లక్ష్మయ్య, గంగారాంగౌడ్, బేగరి విష్ణయ్య పాల్గొన్నారు.

సెయింట్ ఆంథోనీస్‌లో ఉపాధ్యాయ దినోత్సవం


విద్యాసంస్థల అధినేత సోలోమోన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్, జూనియర్ కాలేజీల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత సోలోమోన్‌రెడ్డి మాట్లాడుతూ గురువులు లేని విద్య గుడ్డి విద్య అని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు విజయకుమార్‌రెడ్డి, జయబాలరెడ్డి, అరుణారెడ్డి, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు గురుకుల విద్యార్థులు

హత్నూర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన హత్నూరలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల హత్నూరలో నిర్వహించిన మండలస్థాయి అండర్-14, 17 కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచారు. అదేవిధంగా అండర్-14, 17 ఖోఖో విభాగంలో సైతం ప్రథమస్థానం సాధించి జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శంకర్ నాయక్‌తో పాటు పీఈటీ ప్రశాంత్‌గౌడ్, పీడీ సుభాష్ అభినందించారు.

రేపటి నుంచి హజ్రత్‌షేక్ షహబుద్దీన్ తుర్కీ ఉర్సు


ముస్తాబైన హజ్రత్ షేక్‌షహబుద్దీన్ తుర్కీ రహమతుల్లా దర్గా

జహీరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని శేఖాపూర్ గ్రామంలో గల హజ్రత్‌షేక్ శేఖ్‌షహబుద్దీన్ తుర్కీ రహమతుల్లా 675వ ఉర్సు జరగనున్నాయని నిర్వాహకులు, జహీరాబాద్ షేర్ ఖిజార్ యాపై, ఉత్సవ కమిటీ నాయకులు చస్మోద్దీన్, ఖాజామియ, అబ్దుల్లానిధ్ధీ తెలిపారు. ఉర్సుకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ తదితర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు తరలిరానున్నారు. ఇందులో భాగంగా శనివారం డీఎస్పీ సైదానాయక్, పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్ దర్గావద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

17న రైతాంగ సాయుధ పోరాట సభ

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17న సంగారెడ్డిలో నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వాస్తవ చరిత్ర ప్రజలందరికీ తెలియజేయడమే ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు ముఖ్యఅతిధిగా హాజరవుతున్నారని, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణ పాల్గొన్నారు.

మద్యం వద్దురా... జీవితం ముద్దురా

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం వద్దురా... జీవితం ముద్దురా అంటూ విద్యార్థులకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంగారెడ్డి రీజియన్ 18 అధ్యక్షుడు కొంక రాజేశ్వర్ సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైతే తల్లిదండ్రులు, సమాజానికి దూరమవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ కో ఆర్డినేటర్ రమేష్, ఐసీఐ శిక్షకులు అనిల్‌రెడ్డి, సంగమేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు పీఆర్‌కే రెడ్డి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో గుంతలు పూడ్చివేత


సంగారెడ్డిలోని సాయినగర్‌లో దగ్గరుండి గుంతలు పూడ్చివేయిస్తున్న మహేశ్‌ముదిరాజ్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డికి చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహేశ్‌ముదిరాజ్ తన సొంత ఖర్చులతో స్థానిక సాయిమాణిక్‌నగర్, సాయినగర్ రహదారులకు మరమ్మతులు చేయించారు. వాహనదారుల ఇబ్బందులను గుర్తించిన ఆయన గుంతలను రాతిపొడి, మొరంతో మూసి వేయించారు. అదేవిధంగా హెచ్‌పీ బంక్ నుంచి సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ వరకు ఏర్పడ్డ గుంతలను కంకర, రాతిపొడితో పూడ్చివేయించారు. వాహనదారుల ఇబ్బందులు తీర్చడం పట్ల ఆయా కాలనీవాసుల హర్షం వ్యక్తం చేశారు. కాగా త్వరలో ఆయా కాలనీల్లో పాడైన రోడ్లుకు ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి రోడ్లు వేయించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని మహేశ్ ముదిరాజ్ తెలిపారు.